సాక్షి మహబూబాబాద్

మంగళవారం | 20 | జూన్ | 2023



ఐటీఐ..చదువులో మేటి!

సాంకేతిక విద్యకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. వివిధ ఉద్యోగాలకు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఐటీఐలో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు. - 8లో▸



ఆర్టీసీ లాజిస్టిక్‌తో సత్వర సేవలు

ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీస్‌తో సత్వర సేవలు అందుతున్నాయని ఆర్టీసీ కరీంనగర్ జోన్ లాజిస్టిక్ ఇన్‌చార్జ్ భానుకిరణ్ అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.7^0 /30.1^0

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మానుకోట మున్సిపాలిటీకి మరో అవార్డు



మహబూబాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మానుకోటకు హరితోత్సవం అవార్డు అందజేసింది. పచ్చదనం పెంపునకు కృషి చేసిన రాష్ట్రంలోని 31మున్సిపాలిటీలకు అవార్డులు అందించింది. కాగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీశాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణి అవార్డు అందుకున్నారు. మానుకోట మున్సిపాలిటీలో రూ.4.26కోట్లు వెచ్చించి ఏడు నర్సరీలు, 60 పట్టణ ప్రకృతి వనాలు, ఐదు పార్కులు, 17.5కిలోమీటర్ల మేర మిడియన్ ప్లాంటేషన్, ఎల్‌ఏపీ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు మున్సిపాలిటీని అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 16న హైదరాబాద్ శిల్పకళావేదికలో మంత్రి కేటీఆర్ చేతులు మీదుగా చైర్మన్, చైర్‌పర్సన్ ఉత్తమ మున్సిపాలిటీ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. కాగా మున్సిపాలిటీకి రెండు రాష్ట్రస్థాయి అవార్డులు రావడంపై మున్సిపల్ చైర్మన్, కమిషనర్, అధికారులు, కౌన్సిలర్లతో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

రాత్రి వేళ.. సారొస్తారని..

- నాలుగు గంటల పాటు విద్యార్థుల ఎదురుచూపులు



గూడూరు: సార్ వచ్చి గురుకులానికి తీసుకెళ్తాడని నాలుగుగంటల పాటు జాతీయ రహదారి పక్కన రాత్రివేళ భయంతో విద్యార్థులు ఎదురుచూసిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని దామరవంచ బస్టాప్ వద్ద జరిగింది. వివరాల ప్రకారం.. దామరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా కేంద్రంలో సోమవారం ఇంటర్ నేషనల్ పాఠశాలలో అడ్మిషన్ల కోసం జరిగిన ప్రవేశపరీక్ష రాయడానికి వెళ్లారు. ప్రిన్సిపాల్ ముత్తయ్య ఆదేశాల మేరకు ఓ టీచర్ గురుకులం నుంచి వారిని ద్విచక్రవాహనంపై దారమవంచ బస్టాప్ వద్దకు తీసుకొచ్చి మానుకోటకు వెళ్లే బస్సు ఎక్కించాడు. జిల్లా కేంద్రానికి చేరుకున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ సూచన మేరకు ఓ వ్యక్తి పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాడు. పరీక్ష ముగిసిన అనంతరం మధ్యాహ్నం 3గంటలకు ప్రిన్సిపాల్ ముత్తయ్య వారిని దామరవంచకు బస్సెక్కించాడు. బస్టాప్ నుంచి విద్యార్థులను గురుకులానికి తీసుకెళ్లాలని ప్రిన్సిపాల్ ఫోన్‌ద్వారా ఓ టీచర్‌కు సూచించారు. కాగా సాయంత్రం 4.30 గంటలకు దామరవంచ బస్టాప్ వద్ద దిగిన విద్యార్థులు టీచర్ కోసం రాత్రి 8.30గంటల వరకు ఎదురుచూశారు. ఎవరూ రాకపోవడంతో చివరికి గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి, తన మిత్రుడితో కలిసి పిల్లలను గురుకులం వద్ద దింపి వచ్చారు. ఈ క్రమంలో పిల్లల సంభాషణను వారు వీడియో తీసి గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు స్పందించారు. ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భక్తితో పూజిస్తే ముక్తి..

- శ్రీశృంగేరి శివగంగ పీఠాధిపతి



కాళేశ్వరం: పరమ శివుడిని భక్తితో పూజిస్తే ముక్తి లభిస్తుందని శ్రీశృంగేరి శివగంగ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పురుషోత్తమ భారతి మహాస్వామి ఉపదేశమిచ్చారు. సోమవారం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయానికి ఆయన రాగా అర్చకులు, అధికారులు మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో గణపతి పూజలు చేసి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. కల్యాణ మండపంలో భక్తులకు ప్రవచనాలు తెలిపారు. తీర్థప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ వసంత, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, రాజయ్య, దేవుడ శ్యాంసుందర్, దేవేందర్, సత్యనారాయణ, పద్మ, మహదేవపూర్ పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాటారం ఏఎంసీ చైర్‌పర్సన్ మమత పాల్గొన్నారు.

డిజిటల్ బోధన

- నేడు 'మన ఊరు-మన బడులు' ప్రారంభం
- స్మార్ట్ బోర్డులపై విద్యార్థులకు పాఠాలు
- 8,9,10వ తరగతులకు అమలు



డిజిటల్ బోర్డుపై విద్యార్థులకు బోధిస్తున్న హెచ్‌ఎం

మహబూబాబాద్ అర్బన్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు- మనబడి కార్యక్రమం ప్రవేశపెట్టింది. ఈ మేరకు జిల్లాలోని పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. కాగా నేడు ఆయా పాఠశాలలను ప్రారంభించి డిజిటల్ తరగతులు చేపట్టనున్నారు. నూతన టెక్నాలజీతో స్మార్ట్ టీవీల ద్వారా 8,9,10వ తరగతుల విద్యార్థులకు ఉపాధ్యాయులు డిజిటల్ తరగతులు బోధించనున్నారు.

ఎంపికైన పాఠశాలలు..

జిల్లాలో 898 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో హైస్కూళ్లు 100, యూపీఎస్ 121, ప్రైమరీ స్కూళ్లు 677ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 10,68,29 మంది విద్యార్థులు చదువుతున్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం మొదటి విడతలో జిల్లాలో 315 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 35 బడుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేటి విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా పాఠశాలల్లో డిజిటల్ బోధనను ప్రారంభించనున్నారు. ఈ మేరకు డిజిటల్ టీవీలను ఏర్పాటు చేశారు. బ్యాటరీలను ఏర్పాటు చేయగా.. కరెంట్ లేకున్నా ఆరుగంటల పాటు బ్యాకప్‌తో విద్యార్థులకు వీడియోల ద్వారా బోధించే అవకాశం ఉంది. టీవీకి ఇరువైపుల గ్రీన్ చాక్‌బోర్డు ఏర్పాటు చేశారు. వీలు ఉన్నప్పుడు చాక్‌పీస్‌లతో పాఠాలు చెప్పవచ్చు.

డిజిటల్ తరగతులతో ప్రయోజనాలు..

- దృశ్యరూపంలో బోధించడం వల్ల విద్యార్థులు పాఠాలు మరిచిపోరు
- వీడియో రూపంలో పాఠాలు సులభంగా అర్థమవుతాయి
- డిజిటల్ తరగతులతో పెరగనున్న హాజరుశాతం
- వీడియోల ద్వారా బోధిస్తుండడంతో ఆయా సబ్జెక్టులపై అవగాహన
- అప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం
- అన్ని సబ్జెక్ట్‌లపై విస్తృత అవగాహన వస్తుంది
- కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్ట్‌ల్లో బొమ్మలను గీసుకోవచ్చు.

చాలా సంతోషంగా ఉంది..



డిజిటల్ విధానంలో తరగతులు వినడం అంటే ఎంతో ఆనందంగా ఉంది. స్మార్ట్ టీవీలో ఇప్పటి వరకు సినిమాలు, పాటలు విన్నాను. తరగతి గదిలో స్మార్ట్ టీవీలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించడం అంటే ఎంతో ఆసక్తిగా ఉంది. వీడియోల ద్వారా పాఠాలు త్వరగా అర్థమై మరిచిపోయే అవకాశం ఉండదు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు దోహదపడుతాయి.

– అనూష, పదో తరగతి విద్యార్థిని, మానుకోట ప్రభుత్వ పాఠశాల

ఒకసారి వింటే మరిచిపోరు..



ఉపాధ్యాయులు సాధారణ పద్ధతిలో చెప్పే పాఠాలను తరగతి గదిలో వినడానికి మాత్రమే అవకాశం ఉంటుంది. కానీ డిజిటల్ తరగతుల ద్వారా వింటూనే పాఠ్యాంశాలను దృశ్యరూపంలో కూడా గుర్తు పెట్టుకోవచ్చు. ఒకసారి వింటే మరిచిపోరు. ఈ సారి పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం.

– రామారావు, డీఈఓ

హరితహారానికి అధిక ప్రాధాన్యం



అర్బన్ పార్కులో మొక్కనాటి నీరు పోస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, డీఎఫ్‌ఓ, జిల్లా అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ శశాంక
- అటవీశాఖ ఆధ్వర్యంలో హరితోత్సవం

మహబూబాబాద్ రూరల్: హరితహారం కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ శశాంక అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో హరితోత్సవం నిర్వహించారు. ఈమేరకు మొదట జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం నుంచి వివేకానంద సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జమాండ్లపల్లి శివారులోని అటవీ శాఖ అర్బన్ పార్కులో హరితోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ శశాంక మాట్లాడారు. ప్రతీ ఒక్కరు మొక్కల ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. హరితహారం విశిష్టతను గుర్తించి విరివిగా మొక్కలు నాటడంతో పాటు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ ఇంటికి 6మొక్కలు పంపిణీ చేసి, నాటేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 8లక్షల ఎకరాల విస్తీర్ణం ఉందని, దీనిలో 3.60 లక్షల ఎకరాల్లో అడవి ఉండి తీరాలన్నారు. ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ.. 23శాతమే అడవులు ఉన్నాయని, దీంతో సకాలంలో వర్షాలు పడక ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రతీ చెట్టు మన జీవన ప్రక్రియలో అందిస్తున్న సహకారాన్ని గుర్తు చేశారు. ఇంటింటా మామడి, జామ, నిమ్మలాంటి మొక్కలే కాకుండా పూల మొక్కలు కూడా పెంచుకోవాలని సూచించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం హరితహారం కార్యక్రమంపై నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రశంసపత్రాలు అందజేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ పాటల ద్వారా హరితోత్సవం విశిష్టతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ పింకేష్ కుమార్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, డీఎఫ్‌ఓ రవికిరణ్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అటవీ శాఖ అభివృద్ధి అధికారి పోలోజు కృష్ణమాచారి, జెడ్పీటీసీ లూనావత్ ప్రియాంక, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫరీద్, యాళ్ల మురళీధర్ రెడ్డి, జిల్లా అధికారులు, అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ పరీక్షల్లో 18 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షల్లో వివిధ పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 18 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తొర్రూరు సమతా కళాశాల, మరిపెడ ఆర్‌జేఆర్‌ఎం డిగ్రీ కళాశాల, ఖమ్మం ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరి చొప్పున, ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 11 మంది, భద్రాచలం కళాశాలలో ఇద్దరు, చెర్ల కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు వారు తెలిపారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మహబూబాబాద్: మానుకోట తహసీల్దార్ ఇమ్మానుయేల్‌పై దాడిని నిరసిస్తూ తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పలు ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు తెలిపి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీఓ జిల్లా అధ్యక్షుడు హరికోట్ల రవి, టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంజిత్, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రంజిత్ మాట్లాడుతూ.. తహసీల్దార్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఉద్యోగ సంఘాలు కలిసి పోరాటాలు చేస్తేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కావన్నారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతి పత్రం అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మానుకోట తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఆర్డీఓ కొమురయ్య, పలు సంఘాల నాయకులు రఫీ, నాగ బ్రహ్మాచారి, రాంప్రసాద్, తిరుపతి,సుధాకర్,రాజేష్, గౌస్, నాగ భవాణి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నామమాత్రంగా ప్రజావాణి

- వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్
- ఆరుశాఖల అధికారులు మాత్రమే హాజరు
- నిరాశతో వెనుదిరిగిన దరఖాస్తుదారులు



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్



సమావేశ మందిరం వద్ద దరఖాస్తుదారులు



అధికారులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం నామమాత్రంగా సాగింది. కలెక్టర్ శశాంక హరితోత్సవంలో పాల్గొనడంతో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ డేవిడ్ దరఖాస్తులు స్వీకరించారు. కాగా ప్రజావాణికి ఆరు శాఖల అధికారులు మాత్రమే హాజరుకావడంతో దరఖాస్తుదారులు నిరుత్సాహంతో వెనుదిరిగి వెళ్లారు. 92 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

10.30 గంటలకు ప్రారంభం..

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించారు.అదనపు కలెక్టర్ డేవిడ్ ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. కాగా జెడ్పీ సీఈఓ రమాదేవి, సీపీఓ సుబ్బారావు, జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నర్సింహమూర్తితో పాటు మరో రెండు శాఖల అధికారులు మాత్రమే పాల్గొన్నారు. మిగతా శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. కాగా దరఖాస్తుదారులు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. మధ్యాహ్నం తర్వాత అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, కొంత మంది అధికారులు ప్రజావాణికి వచ్చినప్పటికీ లాభం లేకుండాపోయింది.

ఇది ఒక కారణమే..

మానుకోట తహసీల్దార్ ఇమ్మానుయేల్‌పై దాడిని నిరసిస్తూ తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాగా టీజీఓ, టీఎన్జీవోఎస్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం, పలు సంఘాల నాయకులు మద్దతు ఇవ్వగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. దీంతో చాలా మంది ఉద్యోగులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాలేదు.

బాధితులకు అండగా ఉంటాం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని, నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకొని బాధితులకు అండగా ఉంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి ఎస్పీ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజావాణిలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాలని, కచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించాలన్నారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై, మహిళలపై జరిగే నేరాలపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు.

ప్రతీ ఒక్కరి బాధ్యత..

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, ఈ మేరకు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్, గెస్ట్‌హౌస్ ఆవరణలో ఎస్పీ సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్వచ్ఛమైన, అహ్లాదకరమైన వాతావరణం కోసం మొక్కలు నాటామన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, అర్‌ఐలు నరసయ్య, లాల్ బాబు, పూర్ణచందర్, సురేష్, సీఐలు బాలాజీ వరప్రసాద్, రవికుమార్, శ్రీనివాస్, ఫణీధర్, సతీష్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

మహబూబాబాద్ రూరల్: రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో నెల వారి నేర సమీక్ష సమావేశం మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ తీరుతెన్నులపై వివరించారు. ప్రతి అధికారికి స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలన్నారు. లాంగ్ పెండింగ్ కేసులను త్వరగా ఛేదించాలన్నారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు., కోర్టు డ్యూటీ ఆఫీసర్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి తరచూ శిక్షణ తరగతులు నిర్వహించి వారి పనితనాన్ని మరింత మెరుగుపర్చాలని ఆదేశించారు. ప్రజలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణ బాబు, తొర్రూరు డీఎస్పీ రఘు, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన పటిష్టంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ఓటరు జాబితా పరిశీలన పటిష్టంగా చేపట్టాలని, ఇందుకు తగిన పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 22వరకు ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఒక ఇంట్లో ఆరుగురు ఓటర్లు ఉంటే తప్పనిసరిగా పరిశీలన చేయాలన్నారు. 18ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాలు ఉండాలని చెప్పారు. 08719-241950, 18005991950 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమస్యలు తెలపాలన్నారు. సమీక్షలో ఆర్డీఓలు కొమురయ్య, రమేష్, 18 మండలాల తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

అబ్బాయిపాలెంలో ఎమ్మెల్యేకు నిరసన సెగ..

- రెడ్యానాయక్ చేతిలోని మౌత్ గుంజుకున్న వార్డు సభ్యుడు



ఎమ్మెల్యే చేతిలో మౌత్ గుంజుకున్న వార్డు సభ్యుడిని బయటకు పంపుతున్న నాయకులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెంలో డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు నిరసన సెగ తగిలింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగా సొంత పార్టీ వార్డు సభ్యుడు మౌత్ గుంజుకున్నాడు. దీంతో ఎమ్మెల్యే సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం, గాలివారిగూడెం, దారావత్‌తండా, అమ్యనాయక్ తండాలో సోమవారం ఎనిమిదో రోజు ఎమ్మెల్యే రెడ్యానాయక్ పర్యటన కొనసాగింది. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ మేరకు అబ్బాయిపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగా.. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మూడో వార్డు సభ్యుడు ఎమ్మెల్యే చేతిలోని మౌత్ గుంచుకున్నాడు. సమస్యలపై మాట్లాడడం లేదని వాగ్వాదం చేశాడు. దీంతో అక్కడ ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు నిలువరించి మళ్లీ మౌత్‌ను ఎమ్మెల్యేకు ఇచ్చారు. అయినప్పటికీ తిరిగి మళ్లీ మౌత్ గుంజుకుకోవడంతో ఎమ్మెల్యే సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. ఈ క్రమంలో దళిత కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ఆరోపిస్తూ కాలనీవాసులు ఎమ్మెల్యే కారును అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనకారులను పక్కకు నెట్టి ఎమ్మెల్యే కారుకు దారి ఇవ్వడంతో అక్కడి నుంచి మరో గ్రామానికి వెళ్లారు. దీంతో కాలనీవాసులు రెడ్యానాయక్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే గాలివారిగూడెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారద రవీందర్‌నాయక్, మహేందర్‌రెడ్డి, మాణిక్యం, వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

హామీని విస్మరించిన ఎమ్మెల్యేకు ఓటమి తప్పదు



పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలని పాదయాత్ర చేస్తున్న సీపీఐ నాయకులు

గార్ల: గత ఎన్నికల ముందు పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మిస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని విస్మరించిన ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారథి హెచ్చరించారు. పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ మద్దివంచ నుంచి గార్ల వరకు చేపట్టిన పాదయాత్రను ఆయన పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. పాదయాత్ర రెండు గంటల పాటు సాగిన అనంతరం ఏటి వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చి, నేటి వరకు స్థానిక ఎమ్మెల్యే నెరవేర్చలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రచారానికి వస్తే అడ్డుకోవాలని, చిత్తు చిత్తుగా ఓడించి ఆమెకు తగిన గుణపాఠం చెప్పాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు మూడు సార్లు పాదయాత్ర చేపట్టినా.. బ్రిడ్జి నిర్మాణం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రటిఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు పాదయాత్ర చేపట్టినా.. కనీస సంబంధిత అధికారులు కూడా రాకపోవడం బాధాకరమన్నారు. పాదయాత్రలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాసరావు, మండల కార్యదర్శి వెంకన్న, రాగం రమేష్, కృష్ణమూర్తి, జనార్దన్, వీరన్న, మాగం లోకేష్, రమేష్, నాగేష్, నాగరాజు, వెంకటేష్, రంగయ్య, అమృతమ్మ, వెంకటనర్సమ్మ, బాలమ్మ, భాగ్యమ్మ ఉన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్ర స్థాయి జూడో పోటీలు



వరంగల్: వరంగల్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజులు (21, 22 తేదీలు) రాష్ట్ర స్థాయి జూడో పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాష్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పోటీలు జరుగనున్న దేశాయిపేట రోడ్డులోని ఒయాసిస్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పోటీలను జూడో అసోసియేషన్ అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ప్రారంభిస్తారన్నారు. తూర్పు ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారు కర్ణాటకలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ఒయాసిస్ విద్యాసంస్థల చైర్మన్ పరంజ్యోతి ప్రారంభించారు.

మహిళలు, వృద్ధుల కోసం ట్రావెల్-9 టికెట్



ప్రయాణికురాలికి టీ-9 టికెట్ ఇస్తున్న కండక్టర్

హన్మకొండ : మహిళలు, వృద్ధుల కోసం టీఎస్ ఆర్టీసీ ట్రావెల్-9 టికెట్ ప్రవేశపెట్టిందని ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు, హనుమకొండ డిపో మేనేజర్ బాబు నాయక్ తెలిపారు. ఆదివారం నుంచి ఈ టికెట్ అమల్లోకి వచ్చిందని వారు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వినియోగించుకోవచ్చన్నారు. పల్లె వెలుగు బస్సుల్లో ఈ టికెట్ చెల్లుబాటు అవుతుందని తెలిపారు. రూ.100 చెల్లించి టికెట్ తీసుకుని ఒక రోజులో 60 కిలో మీటర్లు ప్రయాణించొచ్చన్నారు. ప్రతి సర్వీస్‌లో కండక్టర్ వద్ద ఈ టికెట్ అందుబాటులో ఉంటుందన్నారు. దీని ద్వారా ప్రయాణికుడికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతుందన్నారు. 60 ఏళ్లపై బడిన వృద్ధులు, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఐటీఐ..చదువులో మేటి!



ప్రభుత్వ ఐటీఐ కాజీపేట

సాంకేతిక విద్యకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వివిధ ఉద్యోగాలకు విస్తృత అవకాశాలు ఉండడంతో విద్యార్థులు ఐటీఐలో ప్రవేశాలకు మొగ్గు చూపుతున్నారు. కోర్సు కాల వ్యవధి తక్కువగా ఉండడం..పైగా కళాశాల్లోనే ఏర్పాటు చేసే ప్రాంగణ నియామకాల ద్వారా ఎంపికై జీవితంలో స్థిరపడే అవకాశం ఉండడంతో విద్యార్థులు ఈ విద్యను అభ్యసించడానికి ఇష్టపడుతున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో(ఐటీఐలు) 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. ఉన్నత విద్య అవకాశాలు, అప్రెంటీస్ ఎంపికల్లో పారదర్శకత వంటి చర్యలు ఐటీఐ విద్య బలోపేతానికి దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీఐ విద్యపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆయా ఐటీఐల్లో సీట్ల వివరాలు..

జయశంకర్ భూపాలపల్లి	84
ఏటూర్‌నాగారం (ఆదివాసీ పిల్లలకు)	63
మహబూబాబాద్	188
ములుగు రోడ్	678
హన్మకొండ	287
కాజీపేట	68

అర్హతలు..

- కోర్సుల్లో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదో తరగతి తప్పిన విద్యార్థులకు ఏడో తరగతి మార్కులు, ఎనిమిదో తరగతి టీసీ ఆధారంగా వెల్డర్ ట్రేడ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.
- 14 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వారు ప్రవేశాలకు అర్హులు.
- అధిక ఉత్తీర్ణతలున్న వారూ అర్హులే.

ఫీజు వివరాలు..

- ప్రభుత్వ ఐటీఐల్లో రూ. 60 కాషన్ డిపాజిట్ కింద చెల్లించాలి.
- ప్రైవేట్‌లో రూ. 7,200 ఫీజు అమల్లో ఉండగా గతేడాది రూ. 15,500 పెంచారు.

సాంకేతిక విద్యకు పెరుగుతున్న ఆదరణ

- పదో తరగతి అర్హతతో ప్రవేశాలు
- అప్రెంటీస్ నియామకాలు మెరుగు
- ఐటీఐ విద్యలో నాణ్యత, నైపుణ్యతకు పెద్దపీట

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. హన్మకొండ, కాజీపేట, ములుగు రోడ్, జయశంకర్ భూపాలపల్లి, ఏటూర్‌నాగారం, మహబూబాబాద్‌లో ఉన్నాయి. వీటిలో 1368 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది కొత్త కోర్సులకు అవకాశం కల్పిస్తే కాజీపేట ఐటీఐ శాఖలో మరో 148 సీట్లు పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో ఉన్న 34 ప్రైవేట్ ఐటీఐల్లో దాదాపు 5 వేల సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లోని సీట్లకు ప్రవేశాలు నిర్వహిస్తారు.

అందుబాటులో ఉన్న కోర్సులు ..

పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో ప్రస్తుతం 15 రకాల కోర్సులున్నాయి. ప్రభుత్వ విద్యలో రెండు సంవత్సరాల కోర్సుల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఇంజనీరింగ్ మెకానిక్, ఏవో కెమికల్, ఆర్‌అండ్‌ఏసీ, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్‌మన్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ప్రధానమైనవి. ఏడాది కోర్సుల్లో డీజిల్ మెకానిక్, వెల్డర్, కంప్యూటర్, డ్రెస్‌మేకింగ్, కెమికల్ వంటి కోర్సులున్నాయి. ప్రైవేట్ కళాశాలలు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్, కెమికల్, సివిల్ వంటి డిమాండ్ ఉన్న కోర్సులకే ప్రవేశాలు నిర్వహిస్తున్నాయి.

నైపుణ్యాలు.. అవకాశాలు..

ఆయా కళాశాలల్లో వృత్తి నైపుణ్యాలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ చేపడుతున్నారు. ఫలితంగా ప్రస్తుతం ప్రాంగణ నియామకాలు అధికంగా జరుగుతున్నాయి. గతేడాదిలో జాబ్‌మేళాల ద్వారా 500 మందికి ఉద్యోగాలు లభించాయి. క్యాడ్‌బరి, అపోలో టైర్స్, ఎల్‌అండ్‌టీ, ఓలమ్, ఆర్‌టెల్ కమ్యూనికేషన్, విశాఖ ఉక్కు కర్మాగారం, హైదరాబాద్‌కు చెందిన కంపెనీలు ఉద్యోగాలు కల్పించాయి.

ప్రభుత్వ ఐటీఐల్లో దరఖాస్తుల పరిశీలన..



ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ఆరంభమైంది. మరోపక్క దరఖాస్తుల పరిశీలన కూడా చురుగ్గా సాగుతోంది. ప్రభుత్వం సంస్కరణల ద్వారా విద్యలో నాణ్యత పెంచే చర్యలుపై దృష్టిసారించింది. భవిష్యత్తులో అభ్యర్థులకు అవకాశాలు పెరుగనున్నాయి. జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలి.

– అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ కాజీపేట, ఐటీఐ

మూల మర్రితండా జీపీకి తాళం

- సర్పంచ్ కుమారుడి ఆగడాలపై ప్రజల ఆగ్రహం
- అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపాటు



గ్రామ పంచాయతీకి తాళం వేస్తున్న తండా వాసులు

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం మూలమర్రితండా గ్రామ పంచాయతీ కార్యాలయానికి తండా వాసులు సోమవారం తాళం వేశారు. అనంతరం సర్పంచ్ కుమారుడి ఆగడాలను నిరసిస్తూ తండాలోని ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ తేజావత్ జగినిలాల్ కుమారుడు భరత్‌కుమార్ ఆగడాలు రోజు రోజుకూ అంతులేకుండా పోతున్నాయన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి వీడీసీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా చేస్తే తమ తండాలో మాత్రం సర్పంచ్ తనయుడు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి భరత్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు డీఈఈసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఈఈసెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థులు ప్రవేశాలకు (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దు మీడియం) ఈనెల 21న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 4 నుంచి 10వ తరగతి వరకు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, టీసీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ పీహెచ్‌సీ ధ్రువపత్రాలతో హాజరై పరిశీలన చేయించుకోవాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



మొక్క నాటి నీరు పోస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో హరితోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లతో కలిసి సీఎండీ గోపాల్ రావు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన హరితహారంతో తెలంగాణ వృక్షాలు, వనాలతో పచ్చదనంగా మారిందన్నారు. 9వ విడత హరిత హారంలో ప్రతీ ఉద్యోగి భాగస్వాములవ్వాలన్నారు. రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో నియంత్రించడానికి హరిత వనాలు అభివృద్ధి చేయడం ఎంతో అవసరమన్నారు. ఆకుపచ్చ తెలంగాణ రాష్ట్రంగా నిర్మించడమే మన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్ లాల్, మోహన్ రావు, కిషన్, ప్రభాకర్, రాజుచౌహాన్, కె.ఎస్.గుట్ట, రవీంద్రనాథ్, బీకంసింగ్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్‌తో సత్వర సేవలు

- కరీంనగర్ జోన్ ఇన్‌చార్జ్ కేశరాజు భానుకిరణ్



సంబురాల్లో భానుకిరణ్, అధికారులు, సిబ్బంది

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్, పార్సిల్, కొరియర్ సర్వీస్‌తో సత్వర సేవలు అందుతున్నాయని ఆర్టీసీ కరీంనగర్ జోన్ లాజిస్టిక్ ఇన్‌చార్జ్ కేశరాజు భానుకిరణ్ అన్నారు. లాజిస్టిక్ సేవలు ప్రారంభించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లోని లాజిస్టిక్, పార్సిల్ కౌంటర్‌లో ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటకలోని పలు ప్రాంతాలకు 440 కౌంటర్ల ద్వారా అతి తక్కువ ధరకు అతి వేగంగా పార్సిళ్లను చేరవేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా క్విక్ డెలివరీ పథకం ద్వారా కేవలం రూ.99కే మధ్యాహ్నం 12.00 గంటలలోపు బుక్ చేసిన పార్సిళ్ల రాత్రి 9.00 గంటల లోపు చేరేలా, రాత్రి 9.00 గంటలలోపు బుక్ చేసిన పార్సిళ్లను మరునాడు మధ్యాహ్నం 12.00 గంటలలోపు చేరవేస్తున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 53 కౌంటర్ల ద్వారా తమ సేవలు అందిస్తున్నామని, త్వరలో వరంగల్‌లో డోర్ డెలివరీ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. డోర్ డెలివరీకి ఆసక్తి ఉన్న ఏజెంట్లు సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా లాజిస్టిక్స్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది, హమాలీలను సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎం. వేణుగోపాల్, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డి.శ్రవణ్ కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, బి.సతీశ్ కుమార్, కౌంటర్ ఇన్‌చార్జి జి.రవి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ


- వర్ధన్నపేట మండల కోఆప్షన్ సభ్యుడి దుర్మరణం



పాషా (ఫైల్)

మామునూరు/వర్ధన్నపేట : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై లారీ.. బైక్‌ను ఢీకొనడంతో మండల కోఆప్షన్ సభ్యుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మామునూరు శివారు టీఎస్‌ఎస్పీ బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన ఎండీ.పాషా(72) మండల కోఆప్షన్ మెంబర్‌గా కొనసాగుతున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య నూర్జాహబేగం ఐదేళ్ల క్రితం, పెద్ద కుమారుడు బాషమియా గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. ప్రస్తుతం చిన్నకుమారుడు సలీంపాషా వరంగల్‌లో టైలర్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో పాషా ఆదివారం బైక్‌పై ఇల్లంద నుంచి వరంగల్‌లోని చిన్న కుమారుడు వద్దకు వచ్చాడు. సోమవారం ఉదయం ఇల్లందకు బయల్దేరాడు. మామునూరు టీఎస్‌ఎస్పీ బెటాలియన్ బంక్‌లో పెట్రోల్ పోసుకుని వెళ్తూ రహదారి క్రాస్‌చేస్తుండగా వరంగల్ నుంచి ఇల్లంద వైపునకు వెళ్తున్న లారీ.. బైక్‌ను ఢీకొంది. దీంతో పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్సైలు రాజేష్‌రెడ్డి, కృష్ణవేణి ఘటనా స్థలికి చేరుకుని లారీని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అరూరి రమేష్ ఎంజీఎం మార్చురీకి వద్దకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో యువకుడి మృతి



కిరణ్ (ఫైల్)


వర్ధన్నపేట: ఓ యువకుడు చిన్న వయస్సులోనే గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఘటన వర్ధన్నపేటలో చోటుచేసుకుంది. వర్ధన్నపేటకు చెందిన మేడ కిరణ్(30) బీటెక్ పూర్తి చేసి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కిరణ్‌ను వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేటి పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 20న నిర్వహించే అన్ని పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ సోమవారం రాత్రి తెలిపారు. దూరవిద్య ఎమ్మెస్సీ మ్యాథ్స్ ఫైనల్ ఇయర్ పేపర్ కూడా వాయిదా వేశామని, ఆ పేపర్ పరీక్షను జూలై 3వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు.

శోభాయమానం.. సహస్ర కలశాభిషేకం

- సోమవారం ఉదయం నుంచి కార్యక్రమాలు ప్రారంభం
- శాకంబరీ ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దాస్యం



అమ్మవారికి కలశాభిషేకం చేస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్ : చారిత్రక భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారికి సహస్రకలశాభిషేకం శోభాయమానంగా జరిగింది. ఉత్సవ కార్యక్రమాలు సోమవారం ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిర్మాల్యసేవలు, అమ్మవారికి నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, ఉత్సవానుజ్ఞప్రార్థన, గౌరి గణపతిపూజ, తదితర పూజలు నిర్వహించి కలశ స్థాపన చేశారు.

ఉత్సవాలను ప్రారంభించిన చీఫ్ విప్ వినయ్‌భాస్కర్..

ప్రభుత్వ చీఫ్‌విప్, హన్మకొండ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య శాకాంబరీ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్, సారయ్యకు ఈఓ శేషు భారతి, భద్రకాళి శేషు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకున్నారు.

శోభాయమానంగా సహస్రకలశాభిషేకం..

సహస్రకలశాభిషేకం మధ్యాహ్నం ప్రారంభమైంది. అగ్నిపురాణంలో చెప్పిన విధంగా వేదపండితులు నాలుగు వేదాల మూలమంత్రాలు పఠిస్తుండగా భక్తులు భద్రకాళి శరణం మమ అంటూ పలికారు. అనంతరం అమ్మవారికి అభిషేకం శోభాయమానంగా జరిగింది. కొమురవెల్లి దేవాలయం వేద పండితుడు వేలేటి సిద్ధరామశర్మ ద్వివేది, భద్రకాళి దేవాలయ ముఖ్య అర్చకులు చెప్పెల నాగరాజుశర్మ, పార్నంది నర్సింహామూర్తి, సామవేద పండితుడు ప్రదీప్‌శర్మ, అర్చకులు, భద్రకాళి సాంగ అగమ వేద పాఠశాల విద్యార్థులు అభిషేకకార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, వరంగల్‌కు చెందిన బాసాని విశ్వప్రకాశ్, శోభ దంపతులు సహస్రకళశాభిషేకం దాతలుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని కాళీక్రమంలో అలంకరించారు. రాత్రి కామేశ్వరీనిత్యాక్రమంలో అవరణార్చనలు, సాయంతనపూజ, నీరాజనమంత్రపుష్పం,తీర్థప్రసాదవితరణ జరిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.5 లక్షల విలువైన నగలు, రూ.75వేల నగదు అపహరణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ, క్లూస్‌టీమ్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న ఓ ఇంట్లో దుండగులు చొరబడి రూ.5 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరుగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు పొన్నం లింగం, శ్రీలత దంపతుల కథనం ప్రకారం.. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహం జరిగింది. ఆరు నెలల నుంచి కుమారుడు, కోడలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. లింగం, శ్రీలత స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉంటున్నారు. అయితే శ్రీలత అమ్మగారి ఊరు ఐనవోలు మండలం సింగారం గ్రామానికి దంపతులిద్దరూ శనివారం వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఆదివారం రాత్రి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.75వేల నగదును అపహరించారు. సోమవారం ఉదయం దంపతులు ఇంటికి వచ్చేసరికి గేటుపక్కన ఉన్న ఇనుపరాడ్ వంగి ఉండడం, పూల కుండి కింద పడి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూసేసరికి ఇంటి వెనుక తలుపు తెరిచి ఉంది. బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న 8 బంగారు ఉంగరాలు, ఒక బంగారు గొలుసు, కమ్మలు, పుస్తె మొత్తం 8 తులాల బంగారు నగలు, వెండి పట్టగొలుసులు, మట్టెలు, బ్రాస్‌లెట్ మొత్తం 20 తులాల వెండి ఆభరణాలు, రూ.75వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ ఎ.రాఘవేందర్, ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్ అక్కడకు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఘటనా స్థలిని పరిశీలించిన ఏసీపీ

విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ ఘటనా స్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీమ్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో అక్కడకు చేరుకుని వివరాలను సేకరించారు. బాధితుడు లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సీఐ

పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే..

స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, ఏసీపీ కార్యాలయానికి సమీప కాలనీలోని ఇంటిలో చోరీ జరగడంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లాలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగలు హల్‌చల్ చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు రాత్రివేళల్లో గస్తీని, పెట్రోలింగ్‌ను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.